
Sarma

# మట్టి మనుషులు

--బమ్మిడి జగదీశ్వరరావు

"అయ్యా!....... నేను వున్నంత కాలమేనయ్యా, .... ఈ వూరు తోటి..... ఈ మట్టీతోటి పేగు సంబంధం.... ఈనా గుప్పెడు పేనం గుటుక్కు మనీస్తే అంతాసరి. మీ తాతగోరి వూరే మీకు పరాయి వూరయిపోతాది! పొన్నూరయిపోతాది! సుట్టపుసూపుక్కూడా నొయ్యకుండయి పోతాది!!......." అమ్మమ్మ మాటలు జ్ఞాపకానికొస్తుంటే కళ్ళలో నీళ్ళూరాయి. తాతగారి వూరిమీదుగ వచ్చినగాలి బస్సులో వున్న నన్ను స్పృశించి జలదరింపజేసింది. వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. గుండె అంతా భారమైనట్టు వదిలిన ఊపిరి నిట్టూర్పైంది.

ఏటి గట్టు మలుపులో బ్రిడ్జీ మీదుగ బస్సు తిరుగుతూంది. ఏటినీరు గడ్డ కట్టుకు పోయినట్టు ఏటిలో ఏ శబ్దమూ లేదు. బ్రిడ్జీ దాటిన బస్సు మట్టిరోడ్డులోకి వచ్చింది. సరి తాతగారి వూరు వచ్చేసినట్టే! ఆత్రంగా నా కళ్ళు దేవులాడుతున్నాయి. రోడ్డువారన వున్న చెట్లు వచ్చిపోయిన వాహనాలు రేపిన మట్టికీ...దూళి దుమ్ముకీ పచ్చదనం పోయి ఎర్రగా.... మాసిన ముఖాల్తో నిలుచున్నట్టున్నాయి.

చిన్నప్పుడు తాతగారి వూరు వచ్చిందంటే అమ్మ ఒడిలోంచి దూకి ఆనందంతో వేసిన వెర్రికేకలా జ్ఞాపకాల్ని ఆవిష్కరిస్తూ బస్సు హారను మోత! ఊరు వచ్చేసిందని!! బస్సు దిగాను. క్షణకాలం అడుగులు ఎటూ పడలేదు.

ఊరు పరాయిదైనట్టూ..... పాలు పెట్టిన తల్లే పాడెక్కి వెళ్ళిపోయాక చితి చూడ్డానిక్కూడా నోచుకోని కొడుకులా.... కొయ్యబారి నిలుచున్నాను. నిజమే! అమ్మమ్మ చనిపోయాక ఒంటరిపక్షయి పోయిన తాతయ్య గూడు వదిలేసాడు. నలుగురిని కన్నందుకు ఏడాదికి నాలుగు వాటాలు పడి- వాటాకు మూడునెలల వంతున అతిథిలా మిగిలాడు. నాలుగు మెతుకుల కోసం వలస పోయిన బాటసారయాడు!.....

బస్సు హారనువేసుకుంటూ ముందుకు కదిలిపోయింది. అలా కదిలినప్పుడు రేగిన మట్టిగాల్లోకి కలసి వుక్కిరిబిక్కిరైతే ఊరి రోడ్లోకి అడుగుపెట్టాను.

అమ్మమ్మ ఈ ఊరునీ..... లోకాన్నీ వదిలివెళ్ళిన ఈ ఆరేడేళ్లలోనూ ఎన్ని మార్పులొచ్చాయి? తాతయ్య ఒక్కడూ వలసపక్షి అయిపోవడంతో ఆగిపోలేదు. అమ్మమ్మ పేగు సంబంధమై శాఖోపశాఖలుగా విస్తరించిన కుటుంబాలన్నీ ఆమెతోనే పెనవేసుకున్నట్టు...... ఆమె పోయాక ఆవూరుతోనే పెగు తెగినట్టు సంబంధాలూ తెగిపోయాయి! పెళ్ళిళ్ళకి పేరంటాలకి పండగలకి పబ్బాలకి..... చివరికి వేసవి సెలవులకి విడిది స్థలమయినా ఊరు - అమ్మమ్మ లేక..... తాతయ్య వుండీ లేక దారే మర్చిపోయాం. అమ్మమ్మ తాత అక్కడ అరవై ఏళ్ళు కాపురం చేసుండొచ్చు..... కూతుర్లనీ కొడుకులనీ ఆ మట్టీమీదే పెద్ద చేసుండొచ్చు..... ఆల పురుడులూ పూణ్యాలూ అక్కడే గట్టెక్కి వుండొచ్చు...... మనమల్నీ మునిమనమల్నీ ముద్దులాడిన తేగుడు ఆరిపోయి వుండొచ్చు......

ఇప్పుడు ఊరొక జ్ఞాపకం!

ఇప్పుడు ఊరొక కథ!!

“ఎవ్వరింటికి బాబూ?” ఎవరో అడుగుతున్నారు. ఎక్కడికని చెప్పను? ఎవరున్నారని చెప్పను? ఏ ఏ జ్ఞాపకాల్ని కళ్ళ ముందుంచను తెగిపోయిన పేగుచివరి తడి ఎలా చూపించను?

"నువ్వప్పమ్మ మనవడివి కదరా?"

గుర్తు పట్టారు. తప్పిపోయినదేదో దొరుకుదోంది.

"కూతురు కొడికివా?"...... సరోజిని........ పెద్దానికొడుకు నడిపోడి వికదర.....

ఇంకా దగ్గరగా గుర్తు పట్టారు. చాలు.... చాలు....

"ఎన్నాళ్ళయ్యింది రయ్యాఁ.....సూత్తానో లేదో..... సూడకుండే సచ్చిపోతాననుకున్నాను. మీ యమ్మ రాలేదురా? ఎందుకొస్తుంది...... ఈ వూర్లింక ఎవలుదానికి? మీ యమ్మమ్మ బతుక్కి తలుపులు బడ్డం కాదు.... మీరీ వూరు రాడాకే తలుపుబడిపోనాయి..... ఈ ఊరుతోటి పనేటి? ఇన్నాలయితే సెక్కా ముక్కా వున్నందుకి నాలుగింజలకయినా మీ మామలు ఇద్దరూ వొచ్చేరు. పెద్దోడంతే బూమి తనకాలెట్టేనాడు. మీ సిన్నమామ ఈ ఊర్లోటే వున్నా, బాగార్లయి పోనారుకదా అన్నదమ్ములు వచ్చీ పోవడాల్లేవు.... ఆడపిల్ల కదా మీ యమ్మ రాడానికేమిరా?" తడిబట్ట స్నానం చేసి వస్తోందేమో ఆరిపోయింది, ఆ గొంతులో తడారలేదు. అమ్మమ్మ వయసే వుంటుంది.

అటుగా పోతున్న మరో ఇద్దరూ వింటూ మాతోపాటే నిలబడిపోయారు. నా గొంతు పెగల్లేదు.

ఆ ముసల్దే అంది... "అయ్యొ మీతాతేటి.... మీ సిన్నమాఁవ తోటి జగడమాడి కోరుటుకెళ్తాడట..... ముసలికాలాన ఆడికొద్దురన్నా, అన్నా ఇనడు.... ఆ తర్వాతేమీ మాట్లాడలేకపోయింది.

అంత వరకు నిల్చున్న ఇద్దర్లో ఒకరు...."అనే సూరప్పా.... ఏటీ పిల్లడ్ని ఎండలే నిలబెట్టేనావు... . పోని ఎంత నీ మిత్తరాలు మనవడయినా, కంత సల్లబడిన్నర్త అడగరాదేఁ?!" అనేసరికి తప్పుచేసినట్టు ముసిల్ది ముఖం పెట్టి నొచ్చుకుంటూ "పదరయ్యా పదరా.....

మనిషికనబడతోటికి ఒక్కపాలి ఇదయిపోనాను....." అంది.

నేను ముందుకు కదిలాను.

వాళ్ల వెనుకనే వుండిపోయి అమ్మమ్మ గురించి ఏదో మాట్లాడు కుంటున్నారు. నడుస్తుంటే మాటలు దూరమవుతున్నాయి. రోడ్డు పక్క చెఱువులో ఒక పక్క పశువులు కడుగుతుంటే మరో పక్క పిల్లలు పిల్లిమొగ్గలు వేస్తూ ఈతకొడుతున్నారు. అక్కడే పదేళ్ళ క్రితం నా బాల్యమూ ఈదులాడింది. మొలతాడు తప్ప గుడ్డలన్నీ గట్టుమీదే.... ఎందుకో అడుగులు నెమ్మదించి నడుస్తున్నా నిలబడి నట్టేవుంది.

అమ్మమ్మోసారి అసిరితల్లి పండక్కి కొత్తబట్టలు తొడిగి కళ్ళంలో వున్న తాతని పిల్చుకురమ్మని పంపించింది. అప్పుడు తాతయ్యకు కబురందించానో లేదోగాని వీధిగుంటలతో కలసి చెఱువుకి పరిగెత్తాను. బట్టలు ఒడ్డున తీసి చెఱువు కడుపులోకి దిగానో లేదో కుక్కోటి వచ్చి.... కాళ్ళు ఎత్తుబెట్టి మరెక్కడా చోటుదొరకనట్టు.... ఆ కొత్త బట్టల మీదే పోసేసింది. ఆ బట్టల్ని అలా వేసుకోలేక తడిపేసి అవి ఆరినదాక గట్టుమీదే కూర్చుంటే, ఈ లోగ పొద్దు కుంకిపోయింది. మనవడు కనిపించలేదని వంటలూ వార్పులూ వదిలేసి ఇంట్లో గగ్గోలయిపోయింది. గట్టుమీదనున్న నన్ను ఎవరో తీసుకెళ్లేదాక తప్పిపోయాననేమో ఏడు పులు, అమ్మమ్మ, అన్నమూ ముట్టలేదు. అసిరితల్లి గుడికి వెళ్లలేదు. ఆ రోజు పండగాలేదు. ఇప్పటికీ ఆ సంఘటన మరిచిపో వీలులేదు.

"ఏటిరో మనవడా తోవగాని తప్పిపోనావేట్రా....... మాయమ్మీ మీ నాయనంత సక్కన వున్నార్రా....... "పశువుల తోలుకుపోతూ కావయ్యతాత పలుకరింపు సమాధానంగా తలూపేను.

"వస్తానయ్యా" వెళ్ళిపోయాడు.

చెఱువు పొడవుదాటేసరికల్లా శివుడి కోవెల, కోవెల నానుకొని

రావి చెట్టు. దాని కొమ్మలు నాలుగు వైపులకు విస్తరించి వున్నాయి. అందువల్ల కోవెల గోడలు ఎప్పుడో పడిన వర్షానికి ఇంకా ఆరక జబునెక్కినట్టే వున్నాయి. కోవెల్లో గంటలు ఎప్పుడో ఒకటి మోగు తున్నాయి. కోవెల చుట్టూవున్న ప్రహరీ గోడకు బయటిపక్క ఎవరో పిడకలు చరుస్తున్నారు.

మట్టి రోడ్డు అంతమయి సన్నని వీధుల్లోకి వచ్చాను. ఎవరో పరాయి వాళ్ళొస్తున్నట్టు కుక్కలు రెండు మూడు కలసి అరుస్తూ పరిగెడుతున్నాయి.

"ఏఁవిర బావు..."

"ఏఁవిరయ్యా..... అమ్మాలంతబాగా......"

"మీయమ్మ రాడమేలేదు....పోని ఎంతయిన ఈ వూర్లోటే పుట్టి పెరిగింది అంత మతిలబడదురా ఊరు....."

ఆడాళ్ల ప్రశ్నలు..... పలకరింపుల్లా కనిపించే పట్టి కుదిపేసే ప్రశ్నలు.....

అమ్మ అప్పుడప్పుడూ అమ్మమ్మ గురించి.... ఊరు గురించి చెప్తుంది. తన బాల్యం తలచుకొని చెప్పి చిన్నపిల్లలా ఏడ్చేస్తుంది. తనకి పెళ్ళయిన దగ్గర్నుంచే తల్లీ..... వూరూ దూరమయిపోయేయి అంటుంది. అందుకేనేమో ఏ అర్ధరాత్రి పూటో ఎవరికీ అర్ధంకానట్టు ఏడ్చేస్తుంది. తను పెనిమిటి, ఇందరు పిల్లల మధ్యావున్నా ఎవర్నో దూరం చేసుకున్నట్టు వుంటుందట. అలాంటిది కోళ్లగంప సంసారాన్ని కని ఒంటరి పక్షులయిన అమ్మమ్మకి తాతకి ఒంటరి తనం తప్ప ఇంకో జబ్బులేదంటుంది. అందుకే అప్పుడబ్బుడయినా వెళ్ళి చూసిరావాలం టుంది. కాని అమ్మ వంటమనిషి కాబట్టి... ఇంటి మనిషి కాబట్టి.... ఊరెళ్తానంటె నాన్నతో గొడవే! అంద దీవేస్తే మీయమ్మనే వచ్చి

వుండమను అంటాడు నాన్న.... నేనెలగ వొస్తానే ముసిలోడొక్కడు అంటుంది అమ్మమ్మ. మొత్తానికి కాలం కరిగేపోయింది. అమ్మమ్మ మట్టిలో కలిసేపోయింది.

అప్పటికీ 'అమ్మా! తాతగారి వూరు వెళ్దాం రామేఁ' అంటే 'వున్నప్పుడే వెళ్ళలేకపోన్ను.. ..ఇప్పుడెవులున్నారని అక్కడికెళ్తాం.... ఎవులింట్ల పడుకుంటాం, ఎవులింట్ల తింటాం? ఈ ఏడాదో రెండేళ యిన మీ సిన్నమాఁవ వచ్చినాడంటే ఆడు అరుగేతొక్కొద్దన్నాడు'..... ఇంకేమీ చెప్పలేక అమ్మ ఏడుస్తుంది. అప్పటికా విషయాలు ఆపెయ్యడమే మంచిదనిపించేది నాకు. ఎప్పుడైనా నేనైనా వెళ్తానంటే అవే మాటలనేది.

అలాంటిది అమ్మ ఇప్పుడు నన్ను కోరి మరీ ఊరు వెళ్ళమంది.

పలుకరింపులు... అభిమానంతో... ప్రేమతో... నిష్టూరంతో... పలుకరింపులు.

"ఎంతోడివైపోనావుర... అప్పుడు మీ యమ్మని తప్ప ఎవుల్ని నమ్మోడువే కాదు..."

ఎంత జ్ఞాపకం? నిజానికి వాళ్ళంతా నాకు గుర్తు లేరు. గుర్తెరిగినట్టు నటిస్తున్నాను... అంతే!

తాతగారి ఇల్లు చేరాను. ఇంటి ముందు సాలకూలి పోయి చాలా రోజులయినట్టుంది. పెనక లేదు. ముంజూరు లేదు. జారిపోయిన సొప్ప కుళ్లిపోయి పెంటకుప్పలా వుంది. ఒకప్పుడు ఆసాలలోనే మూడు జెర్సీ ఆవులు, రెండు మేక పిల్లలు, జతపోతులు నింపుగా వుండేవి. పొదుగు దగ్గరే పచ్చిపాలు వేడంటూనే... తాగితే అడ్డు వుండేదే కాదు! ఎవరొస్తే పూటకో కోడి... ఇప్పుడు ఒక్కకోడీ లేదు... కోళ్ళ గూడూ లేదు.

ఇన్నోళ్ళు తాతగారి ఇళ్లొక్కటే వీధంతిటికీ ఎత్తుగా వుండీది. వరదలప్పుడు అంతా ఆ ఇంట్లోనే వుండేవారు. అలాంటి ఇల్లూ పల్లమయి వీధి ఎత్తయింది. అంతకంటే ఎత్తయిన ఇళ్ళూ లేచాయి. పది పన్నెండిళ్ళుదాక డాబాయో, రేకో కప్పుకున్నాయి. మిగతావన్నీ పూరిళ్ళే.

"ఏఁవిర జగమూ..." మామయ్య ఇంట్లోంచి అరుగు మీదకు వస్తూ నన్ను చూస్తూనే పలుకరించాడు. చాలా ఏళ్ళకొచ్చాననేమో ఆశ్చర్యపడుతూ ఇంట్లోకి నడిచి 'ఎవరొచ్చారో చూడు' అత్తయ్యతో అన్నాడు.

"ఏట్రు బాఁవు నువ్వే వంశదారగాని పొంగిపోగలదు"రది ఇకటమో ఇన్నాళ్ళునందుకు కోపమో నాకయితే అర్థంకాలేదు.

అత్తయ్యకాళ్ళు కడుగుకోవడానికి నీళ్లిచ్చి, నేకడుక్కొనే లోపలే అన్నం వడ్డించింది. మామయ్య లుంగీ తెచ్చి ఇచ్చాడు. ఎవరో పోలిక పట్టలేను గాని వయసులో వున్న ఒకామె కోడిగుడ్డు అట్టు పోస్తూ నా వేపు చూస్తూ పలుకరింపుగా నవ్వుతోంది.

అత్తయ్య గ్రహించిదేమో "ఏటలాగ సూత్తావమ్మీ, మీ తమ్ముడే. మీ పరం బావ పెళ్ళంరా, పెళ్ళికి రాలేదు కదా... నీకు, మీయమ్మ కేటి తెలుస్తాదిలే తప్పున పడతారని మీ తమ్ముడ్ని పంపీసింది మీ యమ్మ... అంత సోబత్తు..." అంటూ వుంటే - అప్పుడే అప్రకటిత యుద్ధమేదో ప్రారంభించినట్టు మావయ్య..."ఇప్పుడువన్నీ ఏనికే" అన్నాడు నా పక్కనే కూర్చుంటూ.

దించిన తల ఎత్తకుండ ఆకలికో... ఆ వాతవరణానికో ఆమ్లేటు వచ్చేసరికే సగం అన్నం తినేసాను.

"ఏటిరో మీ బాప్పవొంట...మీ యప్పవొంట అంత బాగుందేటి" నా వేగం చూసి మావయ్య నవ్వుతున్నాడు.

అన్నం తిన్నాక, అమ్మనాన్నల బాగోగులు అడిగారు. తర్వాత నా ఉద్యోగం గురించి అడిగారు. ఇంకా ఉద్యోగం రానందుకు మావయ్య గవర్నమెంటుని తిడితే... బాప్ప్రేమో ఏకంగా మంత్రుల బుర్రలే బద్దలు చేసింది. అందులో వాళ్ళ పిల్లలూ ఉద్యోగం లేక పడుతున్న బాదలూ వున్నాయి.

చాలా సేపు గడచిన తర్వాత ఆ సమయంలో ఏం చేయాలో తెలీక వచ్చినపని గుర్తుకొచ్చి "తాతయ్యేడి" అడిగాను.

దాంతో ఆ నిశ్శబ్దమయిన వాతావరణం మళ్ళీ బద్దలయింది.

"....మేం పరాయి మనుష్యుల మయిపోయినాంరా మీ తాతకి. వారం పది రోజులయిన ఈ వూర్లోటే వున్నా కొడుకు గుమ్మం ఎక్కలేదు. పొరుగోలింటికి ఎళ్ళినాడుగాని మా ఇంటికి రాలేదు. అంత అచ్చేయకుయినోడికి ఏలరమ్మనాల..... సెయ్యమనాల.....?..... సెప్పిన మాట సెప్పన్నాను మీ మాఁవనీ పిలొద్దని తాటించినాను. మా పరువుతీస్సి..... తలెత్తుకోలేకుండ సేపి తిరుగుతున్నాడు..... ఈ ముసిలికాలాన ఏం పోగాలమో......" అత్తయ్య నాతో మాట్లాడుతున్న వీధి చివరివరకూ వినిపించేలావుందాగొంతు.

మామయ్య తలదించుకొనే వున్నాడు.

నేనూ నోరు విప్పలేదు.

"....అవున్రయ్యా.... నువ్వే దరమం సెప్పమీ.... మీ యమ్మా ఆలయ్యనీపి అడ్డగ పడిపాతాదిగాని.. ...ఏమా పెళ్ళయి ముప్పయి ఏళ్ళయిం-దో, ఆ దేవుడి దరమాన మీ మాఁవకి నౌకరీ అవడం తోటి రెక్కల్ని నమ్ముకొని ఎల్లిపోనాం. రిటారుమెంటయితే ఈ వూరికి వచ్చినాం. సొంతూరు రావడమే తప్పరా?..... కూతుర్ల పెళ్ళిళ్ళి సేపి, వున్న నాలుగెకరాలు మీ మాఁవలిద్దరికి ఆనాడే పంచేనాడు మీ తాత,

తన మట్టుకి మాత్రం ఎకరా కళ్ళం మడిసెక్కా వుంచీసుకున్నాడు...."
అత్తయ్య జుత్తు రెండు చేతులతో ఎత్తి ముడివేసి మెట్ట పెట్టుకుంటూ క్షణకాలం ఆగింది.

".......నౌకరీవుంది మాకేనికి.... మావాటాకొచ్చిన రెండకరాల పంటా ఎంతపండనీ పిడికిడి గింజలు పట్టికెళ్ళిందేనాడు లేదు..... అప్పుడు సిన్నకొడుకు మంచోడు అందరికి. మాకూ కుటవాఁము పెరిగి ఒక్క మనిషీ రెక్కలూ అలసిపోయి ఈ వూరొచ్చాం.... ఇన్నాలు.... ఈ ముప్పై ఏళయిన పంటంతా ముసిలోడికే వదిలేనాం కదా.... ఆ ఇసోసమూ లేదురా మీ తాతకి, నువ్వే లెక్కలు కట్టు.... ఇన్నాల పలసాయం ఆ ముసిలోడి ఎకరాపాటి సెయ్యకపోతాదా? అందుకే మా వాటాతోటి ముసిలోడి ఎకరా అడిగినాం తప్పయిపోయింది. ఆ ఎకరా పంటా తిన్నాం తప్పయిపోయింది. పరాయోళ్ళం కదరా? మీ యమ్మమ్మ మీ సిన్నమాఁవని కనలేదు కదరా? మారటోడేమి నా మొగుడు? మీ పెద్దమాఁవ తెలివితేటలు ఈ మనిషికి లేపోనాయి, లేకపోతే ఆలన్నలాగే ఏడాదికింత ఎనకేసుకుంటే అనగూడదు ఈ ఎకరా ఒక ఈక.... మాదినాలు బాగులేవు. మారాతలు బాగులేవు....."
అత్తయ్య రెండు చేతులూ తలకు ఆన్పిగోడకు చేరగిలబడిపోయింది. తడిచిన కళ్ళు రెండూ తుడుచుకుంది. ముక్కు తుడుచుకుంది. గ్లాసుడు మంచినీళ్ళు తాగింది. అక్కన్నుంచి లేచి విసవిసా పెరడ్లోకి వెళ్ళిపోయింది.

మామయ్యింకా మవునం పట్టేవున్నాడు.

"మీ రన్నాలు తినండి......" మామయ్య నుద్దేశించి అన్నాను. రెండు క్షణాలాగి మాఁవయ్య అన్నాడు-

"ఇదే తగువు మీయమ్మకి మాకూ..... పిల్లలు మీరూ అవే పట్టింపులకి పోతున్నారు.... మీ బావలైనా, అందుకే వచ్చీపోవడాలు

లేవు. అన్నీ మర్చిపోయి ఈ పండగ న్నాల్రోజులు సరదాగుండు...' '

మామయ్య వంటగదిలోకి వెళ్ళి కంచం ముందల కూర్చుంటే, నేను నులకమంచం మీద చీరవేసుకు పడుకున్నాను. వచ్చిన పని గుర్తుకువచ్చింది. 'తాతయ్య పండగపూట ఆలింట ఈలింట తినడ మేటి? పండక్కి ఇక్కడకు తీసుకురా' అంది అమ్మ. నేను తాతయ్య మామ్మలకు ముద్దలమైన మనవణ్ని..... నేనయితేనే తీసుకురాగలనని అమ్మ నమ్మకముంచి పంపించింది. పని గుర్తుకురావడంతో లేచి అరుగుమీదకు వెళ్ళాను.

అప్పుడే సూరప్ప 'మనవడా' అంటూ వచ్చింది. 'మా ఇంటికి రావా....'అని నా చెయ్యి పట్టుకు వాళ్ళింటికి తీసుకువెళ్ళింది. 'సల్ల బడ్డావు కావ... కంచేపు కూసో' అంటూ గోనె పరచింది. దాని మీద చీరముక్క చిరుగులది మడిచి కూర్చోమంది. వద్దంటున్నా 'సీనీ నీళ్ళ....టీకి పొళ్ళేవు' సంజాయిషీతోనే బలవంతపెట్టి, తాగినదాక ఊరుకోలేదు.

నాకళ్ళు ఇంట్లో ఎవర్నో వెతుకుతున్నాయి.

అక్కడికి ఓ పద్నాలుగేళ్ళుంటాయేమో ఓ పిల్ల వస్తూ అమ్మమ్మా అంటూ సూరప్పకి ఏదో చెప్పబోయినదల్లా ఆగిపోయింది నన్నుచూసి.

"మీ బావే" అని నావంక తిరిగి 'మరిసి పోనావ్రేటాయ్యా మీ జాన కత్త కూతురు నచ్చిమి, సిన్నప్పుడు నువ్వెత్తుకుంతే ఏడ్సేదేకాదు.... అంత సనువు నీకాడ' సూరప్ప మాటలకి ఆ పిల్ల మరింత తలదించుకుంది, సిగ్గుపడ్తోందేమోమరి.

"పలకరించినావా గుంటకాన...." సూరప్ప ఆ పిల్లని దెబ్బలాడింది.

"చాలా సంవత్సరాలయింది కదా....." అంతకంటే ఏమనాలో తెలీదు నాకు.

సూరప్ప ఒక్క క్షణం ఏదో ఆలోచనలో పడినట్లు ముఖం పెట్టి "మీ యమ్మమ్మ బతికున్నప్పుడు అనీది. ఓలే మిత్తనోరొాదినా!.... నా కుతురు కొడుక్కి నీ కూతురు కూతురికి ముడెట్టాలని... అదెళ్ళిపోయింది. నా నేస్తం అన్నాదని అన్నానుగాని. నువ్వు సదువుకున్నోడివి... ఇది పేదతట్ట... . సూడు ఓ మర్యాద మన్ననా తెలికుండ ఎలగ గెడక్రరలాగ నిల్చొందో...." అంటున్న ఆ మాటలకు ఆ పిల్ల సిగ్గెగిరిపోయినట్టుంది, కోపంతో లోపలిగదిలోకి వెళ్ళిపోయింది.

మళ్ళీ సూరప్పే అంది......."దాన్దేటి తప్పు, దాని కరమ్ము, ఆలమ్మ పాపమూ ఎక్కువైపోనాయి....."

అప్పుడే నేవెదుకులాడుతున్న జానకత్త వచ్చింది. వచ్చి చూసి పలకరింపుతో ఆగలేదు. పక్కనే వచ్చి కూర్చుంది. నా రెండు చేతులూ పట్టుకుంది. నా తలమీద చెయ్యివేసి నిమిరింది. భుజంమీద పాకుతున్న చీమని తీసి కసితారా చంపింది. మళ్ళీ లేచి పంచదార నీళ్ళు కలిపివ్వబోయింది. సూరప్ప 'నాను ముందలే ఇచ్చినాను' అనేసరికిగాని ఆగలేదు.

"ఎంతోడివి అయిపోనావురా బడవా"..... ఇంకా చిన్నపిల్లాడ్నే అయినట్టు ఆ మాటలూ చేష్టలూ కనిపిస్తున్నాయి. ఆశ్చర్యంగా నా కళ్ళలోకి చూస్తోంది.

నిజానికి ఆశ్చర్యం నాకు కలగాలి. లేకపోతే జానకత్త జానకత్తేనా అని? ఈ ఆరేడెళ్ళలోనే ఇరవై సంవత్సరాల వయసు ఎక్కువ పడినట్టుంది. అమ్మకంటే చాలా చిన్నది. పెద్ద అన్నయ్యకంటే నాలుగేళ్ళే పెద్ద.... అలాంటి జానకికి అప్పటిలా జాకట్టులేదు. జాకట్టు అవసరమూలేదు. గుండెలు ఎండిపోయున్నాయి. నా కళ్లలో ఓ సారి ధూళి పడితే... ఎగర బోతలప్పుడే అనుకుంటాను. అప్పుడు లచ్చి నెలల పిల్ల... నా తలని ఒడిలో పెట్టుకొని రెండుచేతులూ కలిపినా పట్టని

రొమ్మని పిండితే..... తెలిసీ తెలియని సిగ్గుతో కళ్ళు మూసుకుంటే... ..'పాలు నోట్ల పాయ్యాల్రా గుంటడా' అని తిట్టి; 'ఓలమ్మో పెద్ద మగోడికి సిగ్గు' అని నవ్వి, కళ్ళలో పాలుపోసిన జానకి....'ఓలగుంటామగోడిలా ఏటా బలుపు' అని వరసైనోళ్ల చేత తిట్లుకాసిన జానకి.....

ఇప్పుడారూపాన్ని చూస్తుంటే గుండె బరువైంది..... చెఱువైంది. కళ్ళలో నీళ్ళొకటే తక్కువ...

అయినా ఇంకా స్వచ్ఛంగా నవ్వుతోందే?!

"ఏట్రలగ సూత్తన్నక... పిచ్చి గుంటడా......" జానకత్త తిడుతోంది. నవ్వుతూ తిడుతోంది. ఆ నవ్వులో మునపటిలా చెక్కిళ్ళు ఎరుపుద నంలేదు.... దగ్గరికి తీసుకొని ముద్దులాడాలనీలేదు. ఆనవ్వులో సక్కి దవడలు... లోతులకుపోయిన కళ్ళు ఎక్కువసేపు చూడలేకపోయాను.

సూరప్ప ఎలా గ్రహించిందో గాని "మీ మాఁవ పోయాక మనిషినిఏటి సూత్తావయ్యా.... ఎముకల కంపే, నా కన్న ముసిలయిపోయింది నా కూతురు" అంది ఏదో జ్ఞాపకాన్ని నెమరు వేసుకుంటున్నట్టు.

జానకత్త ఇదేమి పట్టించుకున్నట్టులేదు. నాకు జున్నంటే చాలా ఇష్టమని, ఎవరిదో ఆవు ఈనిందని జున్నుపాలు తీసుకువస్తానని, వుండమని పరుగుతీసింది.

ఆ తరువాత సూరప్పే చెప్పింది. జానికి మొగుడు దాలిగాడు మామూలు చావు చావలేదట. బలివిన వచ్చిపోయాడట. కాదు బలివిన చంపేసినారట. ఎలక్షన్లప్పుడు కూలికి బేనరుగుడ్డలు కడుతుంటే కాలి జారిమేడమీదనుండి పడిపోయాడని పుట్టించేరట, కాని నిజానికి ఎగస్పార్టీవోళ్ళు వంగి బేనరుకడతున్న దాలిగాడిని వెనుక నుంచి వచ్చి రెండుకాళ్ళూ ఎత్తేస్తే మనిషి ముందుకు తూలి పడి తలకిందకు గుద్దుకొని బుక్కడు రక్తం కక్కి చచ్చిపోయేడు.

సూరప్ప ఏడ్చేస్తోంది. ఎలా ఆమెను సముదాయించాలో నాకు తెలీలే. జానకత్త కూతురే వచ్చి..... "ఊరుకోయే.... అమ్మొస్తే మళ్ళా ఏడుపులు....నువ్వూరుకో అంతే....." ఓదార్చుతోంది. ఇందాకటి కోపం ఎగిరిపోయినట్టుంది.

కొంచెం సేపటికి సూరప్ప కుదిటపడి, కళ్ళు తుడుచుకుంటూ 'మీ తాతని కలిసినావురా?' అడిగింది. లేదని విషయం చెప్పాను. ఎటెల్లాడో అంది సూరప్ప. నరసన్న పేట బస్సు ఎక్కినాడని సూరప్ప మనంవరాలు తను చూసినట్టు చెప్పింది.

"పీడరీ బావు దగ్గిరికే ఎల్లుంతాడు..... అంతకు మించి ఓడల వర్తకమేటాడికి..?" అంటూ ఏదో చెప్పబోయింది.

ఇంతలో పరం బావ వచ్చాడు. వస్తూనే 'వచ్చిపూటే కాలేదు ముగ్గులేసేస్తున్నావా?.....' నవ్వుతూ అడిగాడు. సాయంత్రంమవుతోంది కళ్ళంవేపు వెళ్ళి అలా తిరిగొద్దామన్నాడు.

మళ్ళీ వస్తానని నేను లేచి నిలబడ్డాను.

"వుండు.... మాయమ్మొచ్చేస్తాది... జున్నుపాలు కెళ్ళింది ఎంచేపు?" జానకత్త కూతురు నాతో చెప్తున్నా, సూరప్పవైపే నువ్వన్నా చెప్పన్నట్టు చూస్తోంది.

"ఎక్కడికెళిపోతాడే మీ బావ..... వుంటాడు, తింటాడు....." అభయమిచ్చినట్టు అన్నీ చెప్పేసి కళ్ళానికి తీసుకుపోయాడు. అక్కడ నూర్పులూ కుప్పలూ పనిలోవుంటే ఇక్కడకాదని ఏటివేపు పదమన్నాడు. దారిమధ్యలో ఒకటిరెండు ప్రశ్నలు ఇంటిగురించి వేసి ఆ తరువాత చూసిన సినిమాల గురించి అడిగాడు.

ఏట్లోకి దిగి ఇసుక మేటమీద కూర్చున్నాక అసలు విషయం మొదలుపెట్టాడు.

తనకి పెళ్ళయినా, ఇద్దరు పిల్లలు కలిగినా ఉద్యోగం లేకనే ఇంకా చదువని యూనివర్సిటీ పట్టుకు వేలాడుతున్నానన్నాడు. నిజానికి చదువుమీద ఇంటరెస్టే లేదన్నాడు. చదువంతా కాకపోయినా పనికిరాని సిలబస్సే పాఠ్యపుస్తకాల్లో ఎక్కువన్నాడు. రెండు పీజీలు, ఒక ప్రొఫెషినల్ కోర్సు వెలగబెట్టిన తన డిగ్రీల కొలతలు చెప్పాడు. పెళ్ళొద్దన్నా వాళ్ల నాన్న ఒప్పుకోలేదట. పిల్లలు వద్దనుకున్నా పుట్టేరట. ఒక అబార్షన్ కూడా జరిగిందన్నాడు. తిరిగి తిరిగి ఈవూరే వచ్చేసాడట. చివరిగా చెప్పిందేవిటంటే తన 'వాటా' ఎంతయితే అంత.... అరెకరాయో.. . అరవై సెంట్లో ఇచ్చేస్తే.... అమ్ముకొని వ్యాపారం చేద్దామని వుందన్నాడు. తన వాటకోసమే తనింకా ఆ ఇంట్లో వున్నాననీ అన్నాడు.

తరువాత ఏరువిడచి పొలాల వెంబడి వస్తుంటే ప్రతి గట్టూ మట్టినేకాదు మనుషుల్నీ వేరు చేస్తున్నట్టు తోచింది. తాతయ్య, మావయ్యా, పరంబావ రేపువాడి పిల్లల పిల్లలూ చెరోగట్టయి చేతులూపుతున్నట్టనిపించింది.

నా మవునం వాడికి ఎలా తోచిందోగాని ఇంటికి వెళ్ళిందాక ఇంకేమీ మాట్లాడలేదు. ఇల్లు చేరేసరికి పూర్తి చీకటయింది. అత్తయ్య అన్నం వడ్డించేస్తానని అంది. నాకు ఆకలిగా లేదు. అసంతృప్తిగా వుంది. నా మవునం అత్త అంగీకారంగా తీసుకొని పరం బావకు నాకు ఒకేసరి వడ్డించింది. పరం తరువాత వాళ్ళిద్దరికీ శివం, విశ్వంకి తరువాత వడ్డిస్తానంది.

కరెంటు వున్నా లేనట్టే వుంది. ఓల్టేజి తక్కువగా వుంది. ఫేను వేస్తే గూట్లో దీపం కూడా ఆరిపోదేమో.

జానకత్త అప్పటికి రెండుమూడు దపాలు వచ్చి నాకోసం అడిగి వెళ్ళిందట. భోంచేసాకయినా వెళ్ళాలనుకున్నాను. కాని తాతయ్య

తవుడు మావ వాళ్ళింట్ల వున్నాడని తెలిసి నోట్లోనీలు పుక్కిలిస్తూనే వీధిలోకి నడిచాను. జానకత్త ఇంటికి వెళ్తే ఆలస్యమవుతుందని తరువాత రేపు వెళ్ళొచ్చనీ నిర్ణయించుకున్నాను.

తవుడు మావ ఇంటికి వెళ్తే....."హోరిప్పుడే మీ తాత అల్లాడెళ్తా నని......నువ్వాగోల్లో తిరిగుంటావు....ఎలిపోందు... వచ్చేస్తాడు కూకో....." అంటూ కుర్చీ చూపితే కూర్చున్నాను.

తవుడు మావ నులకమంచంలో మేనువాళ్ళి ఇంటిపేరుతో పెట్టి వరసలు కలిపి ఇకటాలు ఆడి, అత్తగురించి అడిగితే- వ్వాళ్ల కొడుకత్తోరు గురించి చెప్పి అక్కడికి వెళ్ళిందని చెప్పాడు.

తవుడు మావకు ఒక్కడే కొడుకు! నా వయసేవుంటుంది. అప్పుడే ఇద్దరు పిల్లలు కూడా! అందుకేనేమో 'నీవెప్పుడు సేసుకుంతావురా' అంటూ 'పప్పుకూడు పెట్టమని నోరుపోయిందని అంటున్నాడు.'

మంచి సంబంధం చూడమని.... అందం కొరుక్కుంటామా అని.... నాలుగు డబ్బులుంటే వున్న న్నాల్రోజులూ హాయిగా గడిపేసి పోవ చ్చుననీ అన్నాడు. అందుకేనట ఒక్కకొడుకని చూడకుండా ఇల్లరికం పంపించేసాడట. అత్తోరు వున్నా పోయినా అల్లుడుదే 'ఆస్తి!' ధైర్యంగా నమ్మకంగా చెప్పేడు.

ఆస్తి.....ఆస్తి.....ఆస్తి....

ఆ ఆస్తే ఆయువు! ఆ మట్టికోసం నోట్లో మట్టి కొట్టుకుంటున్నారు! మట్టిలో కలిసిపోయిన మనుషులు.... మట్టి మనుషులు....

తరువాత తవుడు మామతో నేనేమీ మాట్లాడలేకపోయాను. ఆయ నకి కునుకు పట్టేసినట్టుంది.

తాతయ్య వచ్చాడు.

చూపు సరీగ ఆనినట్టులేదు.... దగ్గరగా వచ్చి చూస్తేగాని పోల్చుకో

లేక పోయాడు. అందుకు తన కళ్ళని తిట్టుకొని ఇంటందరి బాగోగుల్ని అడిగాడు. డబ్బు అవసరం వుండి అల్లాడ వెళ్ళాడట. రేపు పెందిలే మళ్ళీవెళ్ళాలన్నాడు. నన్ను కూడా రమ్మాన్నాడు. రేపు అంబారంకి ఇచ్చిన రైతుతో తగువుందన్నాడు. తేలిపోతుదన్నాడు. నువ్వు లాయరీ ఎందుకు చదువుకోలేదన్నాడు. ఏ చదువు చదివినా బ్రతుకులేదన్నాడు.

'ఇవన్నీ గొడవ లెందుకు? ఇంటికి పోదాం పద.....' అని నేను అన్నిమాటల తర్వాత కూడా ధైర్యం చేసి అనలేకపోయాను.

అలా అనలేకపోవడానికి, అడగలేక పోవడానికి కారణం వుంది. అమ్మ నాన్నకు భార్య! పెళ్ళితోనే ఇంటిపేరు మార్చుకుంది కదా..... ఇప్పుడు ఫలానా వాడి కూతురెలా అవుతుంది. కూతురుకానిది తండ్రిని పెంచుకుంటుందా? ఎన్నాళ్ళు? అయినా ఆస్తి కొడుకులదయినపుడు పెంపకపు బాధ్యతా కొడుకులదే.....కూతురు ఒకింటి కోడలు!..... ఆమెకు తన తలిదండ్రులను పెంచుకొనే బాధ్యత లేదు. ఇవన్నీ నాన్నమాటలు కావు. అమ్మ మాటలు కావు. లోకం నన్నే తిట్టిపోస్తుందని అమ్మ అంటుంది. అందరూ కూతుర్లే పుడితే ఐడుక్కోవాలా అంటే 'రివాజు' అంటుంది.

వలస పక్షి తాతయ్య ఇంటిదగ్గర చేసే మూణ్నాల్ల భసా రాసాబాసగా వుంటుంది. "ఊరమ్మ కొడుకు మంచోడైగాని... ఇద్రేట్రా ఇద్దూరం....... లోకంలో కొడుకుల్లేరా?....." అమ్మ ఆర్థిక ఇరుకు బాట్ల మధ్య దెబ్బ తగలకుండా, నువ్వేనని నాన్నచేత వేలెత్తి చూపించుకోకుండా భయమో. ... ముందు చూపో.... అమ్మకూడా......??

"పండక్కి రమ్మందామన్నా, పండగ తర్వాతో.....?....." ఈ గదువుల నేను గొంతు విప్పలేకుండా గడియపెట్టాయి.

తాతయ్య నన్ను పడుకోమన్నాడు. చాప పరచి బొంతవేసాడు. తవుడు మామ మంచం మీదకి వచ్చిమన్నా, పరవాలేదన్నాడు.

నేను పడుకుంటే నా పక్కనే కూర్చున్నాడు. అర్ధరాత్రి అవుతున్నా దీర్ఘాలోచనలో వున్న తాతయ్యని చూస్తే నాకూ నిద్రరాలేదు. అలా ఎంతసేపు గడిచిందో గాని తెల్లవారి కళ్ళు విప్పి చూస్తే తాతయ్య రడీగా వున్నాడు. బయల్దేరని నా చేతికో పంకర్ర పుల్లిచ్చి, దార్లో నోరు కదుక్కుందువులే అన్నాడు. నా మాట కోసం చూడకుండా గుమ్మం దిగితే నేనూ వెనకాలే నడిచాను.

దారి మధ్యలో బోరింగు దగ్గర నోరు కదుక్కొని టూరింగు టాకీసు పాకదగ్గర 'టీ' లు తాగేం. ఎవరెవరో తాతయ్యని పలుకరిస్తున్నారు. నన్ను గురించి అడుగుతున్నారు. తాతయ్య మాత్రం 'నా పెద్దకూతుర్రెండో కొడుకు' అని నా గురించి తెలిసినవి తెలియనవీ చెప్తున్నాడు.

మరో గంటకల్లా ఆ వూరు చేరాం.

తాతయ్య ముందుగా ఎవరో షరాబులింటికి తీసుకువెళ్ళారు. చేతికి వున్న ఒక్క వుంగరం తీసి ఇస్తే- ఆ పెట్టె ముందున్నాయన లేవకుండానే అందుకొని గీటు 'పెట్టి అద్దాలు కదిపి చూసి, ఇటూ అటూ తిప్పి పాత బంగారం రేటు తక్కువే' అన్నాడు. లెక్క చూసీ మంటావా, అని పాత చిట్టా పద్దులు తీసి...."పన్నెండొందలు పాతవి.... మొన్న లాయరుకని నాలుగొందలు.... ఇప్పుడు నాలుగొందలిస్తాను.... రెండువేలయిపోతాది...." అన్నాడు. తాతయ్య తలవూపి ఇచ్చిన నాలుగు వందనోట్లూ రెండుసార్లు లెక్కపెట్టాడు.

"ఎళ్ళొస్తాం రయ్యా...." తాతయ్య అరుగుదిగుతూ అన్నాడు.

"ఎళ్లొస్తాం అనకురా పెద్దాయన, ఆస్పెట్లకి...... అప్పకి..... ఎళ్ళొస్తాం అనకూడదు, ఎల్తాం అనాల...." నవ్వుతూ అన్నాడు.

ఆ మాటెందుకో నాకు నిజమనిపించింది. మళ్ళీ తిరిగి వచ్చే

ప్రసక్తి లేదు. ఉంగరం విడిపించే శక్తీ, లేదు. ఎన్ని వస్తువులలా రెక్కలు రాకుండానే ఎగిరిపోయాయో తెలీదు.

"తాతయ్యా....."చెప్పబోయాను.

"ఆకలేస్తందా? టిఫినీ సేస్తావా......" తాతయ్య తిరిగి ప్రశ్నిస్తే అడ్డంగా తలవూపి చేతకానివాడనయాను.

తాతయ్య నన్ను అర్ధంచేసుకున్నట్టున్నాడు. 'ఈ పనియిపోనియ్యిరా ఆతర్త నీకే తెలుస్తాది? నువ్వే సిచ్చేద్దుగాని గాని....' తాతయ్యమాటలు నన్ను మూగవాణ్ని చేసాయి.

వీధి చివరకు వచ్చేసరికి పల్చగా చెట్టుకింద చేరివున్న జనం మమ్మల్ని మాస్తూనే...."అదిగో అప్పన్నా వచ్చేండు....." కేక ఎవరిదో.

"ఏఁవిర మాకు పనులూ పాకుల్లేవనుకుంతన్నావా...రా..రా...." ఎవరో ఓ ముసలాయన పంచె చివర ఎత్తి దోపుకుంటూవున్నాడు. పక్కనే చిన్న మాఁవ, పరం బావ వున్నారు. వారిని చూడ్డంతో నేనేదో తప్పు చేస్తున్నట్టుగ ఒక్క క్షణం మాపు మరల్చి, మళ్ళీ మామూలయేను.

"ఆదీ మీ అయ్యా వచ్చేసాదు, అదరా ఆ తివ్వదూ వున్నాదు తేల్చేసుకొండి, మొకా మొకాలు" మరో పెద్దాయనమాట.

అందరూ చుట్టుమూగారు.

ముందుగా తివ్వడే నోరు విప్పాడు.

"పెద్దలింత మందున్నారు, మీరెలాగ పెప్తే అలాగే పెత్తాను. ఆలంబారం నాను గుత్త పట్టలేదు. నువ్వే పెయ్యి అనీ కందుగుత్త ఆలకినేదు. ఏదో సిన్న రైతుని అంబారం అంటే ఆశపడి పట్టినాను. ఆ ముసిలోడికి ఎంతోకొంత నలుగుర్లాగే గింజలు కొలిసీపోడ్ని. ఇదిగో ఆలసిన్నబాబు ఆదిగాడొచ్చి అది నా బూమి, ఆ గింజలేవో నాకే సెందాలన్నాదు. తండ్రీ కొదుకులేకదా అలగేనన్నాను. ఆలయ్యవి....

ఆగోటి.... ఆ అప్పన్నని 'ఇలాగంతన్నాడు నీ కొడుకన్నాను.' ఎవుడ్నీకు అంబారం కిచ్చినాడు.... ఎవుడికి నీవు గింజలు ఇచ్చేత్తావురా అని ఇతగాడు. అది నా బూమి నాకే సెందాల.... ఎలగివ్వా సుత్తానని అతగాడు. ఈ ఇద్దరితోటి బిజారు పడలేకే ఎవులికి ఇవ్వలే...."

"తివ్వా నీకేటి తిపారమా?...... ఆడి వాటాకి రెండకరాలకి రెండుగింజలయినా ఇవ్వొద్దు.... నా ఎకరాకి నాకు కొలు...." తాతయ్య మాటను చిన్న మామ అడ్డు తగిలాడు.

"......మొత్తం గింజలు నాకే కొలు, ఇన్నాళయిన నానొక్క గింజ నావాటా రెండెకరాల్లోదయినా తీసికెళ్ళినానా?...... ముట్టినానా...."

"నీకెవుడు తీసికెళ్ళొద్దన్నాడురా....."తాతయ్యగొంతు పెరిగింది.

మావయ్య, తాతయ్యల వాగ్యుద్ధం పెరిగేదే "ఆగండేస్..... మీరే తేల్సుకుంటే మాంవుదేనికి గుడ్డామెట్టడానికి......" కసిరాడో ముసలాయన. ఇద్దరూ నోర్లుమూసారు.

అంతట్లోనే తివ్వడు నొరిప్పాడు..... "ఈల్లో ఎవ్వులికిచ్చినా సికాకే," చెప్పబోయాడు. 'అయితె మరేనికి నువ్వుంచీసుకోరా' మరో ఆయన కల్పించుకొనే సరికి అంతా నవ్వేసారు.

మళ్ళీ నిశ్శబ్దం గూడుకట్టుకుంది.

తలపండిన ముసిలాయనొకతను తీర్పు చెపుతున్నట్టు గొంతు సరిచేసుకొని....."రేపేదొచ్చినా తండ్రీకొడుకులు మీరే ఒకటవుతారు, మీమంతా పయే. ఇందల యెవడికి ఏలూమాలు వచ్చిపడిపోవు, ఆటితోటే బతికిరు. అప్పన్న ఆస్తి మూడోటాలేసి, కొడుకులకి రెండో టాలిచ్చి..... మిగిలిన దాన్తోటి ఇద్దరాడ కూతుర్లికి పెళ్ళిళ్ళి సేసి ఎకరా మిగిల్చికున్నాడు. ఆడు సచ్చిపోక ముందే ఏనికి వాటాలేసేనాడో......" పూర్తికాలేదు.

తాతయ్య అందుకున్నాడు....."పెళ్ళిళ్ళయితోటికి ఎవుడి తుంబాదుద్దూ ఒట్టుకోని ఆలే ఎలిపోన్రుగాని. రేపు నీనెప్పుడు గుటుక్కుమనీస్తే బూమి కోసం... మడిసెక్కకోసం- తలలు సెక్కలు సేసుకుంతారు అనీసి ఇదిపడ్డానుగాని లేపోతే ఇప్పుడు నా తల సెక్కలయినట్టుగున్నాదు...."

"ఏ పిల్లల ఇంటిదగ్గరో. గడిపేస్తన్నావు గదరా కాలం, మరేనికిరా నీకి బూమి? మెడకి మెలేసుకుంతావేటి?" మామయ్య పక్కనే వున్న మనిషి ఎవరో తాతయ్యని అడిగాడు.

తాతయ్య ఆ ప్రశ్నకు సమాధానం చాలాసేపు చెప్పలేకపోయాడు. ముఖంలో రంగూ, పెదవి విప్పాక గొంతూ మారిపోయాయి.

"...... నా కళ్ళం మడి ఎకరా సెక్కని అంబారం ఎన్ని గరిసలాత్తా యోమీకు తెల్దా? ఆ గింజలే.... నాకు సేర్లీలకీ.... మందులకీ మాకులకీ.... కడకి ముసిల్దానికి పేర్రట సీరెట్టడానికీ.... నా సుట్ట పీకలకీ....." తాతయ్య ఆగి చుట్టూ చూసి, నేల్లోకి కళ్లు గుచ్చి "నీ నున్నంతకాలం నా కిందరయిపాయాయి పడిపోనామనీసి సెప్పకుంతారు గాని మొన్న పచ్చవాతమొచ్చి కాలూసెయ్యీ రాకపోతే నా డబ్బులున్నంతవరకే నాకు ఆస్పెట్లకి తిప్పినారు. తర్త సరి. జబ్బు మాటపోని వున్నీ, కూరలకి డబ్బుల నన్నిడిగీవోరు.... ఇస్తే మంచి ఆ పూటకి గైబుచ్చుకెళ్ళోరు... లేదూ అంతే గలిమాలినోడ్ని.... శనిలాగా దాపురించినానని తిట్లు తగువులు....." ఇంతా ఏదో గుండెల్లో కెలుకుతున్నా చెప్పడానికి ఇష్టంలేనట్లు ఆగిపోయాడు.

చిన్నమావ పక్క నిల్చున్న ఇందాకటాయనే మళ్ళీ అన్నాడు. "నీ బాదలు నీకున్నాయిరా, కాదన్ను. మరి ఆదిగోడు ఆడిపంట వదిలేసాను ఇన్నాలయిన అంతన్నాడు ఆడినోట్ల మట్టిగొడతావురా..."

తాతయ్య కూడా నిష్ఠూరంగానే సమాధానమిచ్చాడు. "నా సిన్నకొడుకు తల్లీదండ్రి ఎలగున్నారో...." అని తొంగిసూసి ఒంగోలకపోయినా,

పంతాలకో.... పట్టింపులకో.... ఎక్కడో వుజ్జోగంలో వుండి యవసాయం సెయ్యలేకో ఒగ్గేనాడు. వగ్గిస్తే.. ఆ మన్ను అన్నమయిపోతాదిరా? ఆ మట్టిలో సెమటపిండాల. పిండుదుమన్నా ఒక్కా దుక్కీ.....? తిండికి లేకపోయినా ఇత్తనాలకి ముందలే దేవుడి ముదుపులా తీసిపినా గుండా పిండీ.....? ఎరువులు కొనడాకి ఇల్లు తవకాల ఎట్టినా మీవూ రోలుకాడే. వంశధార ఏటికాలువ ఎవలకి అందతంది? గూడెయ్యడాకి పెత్తీలేదు, మోటరు పెట్టించడానికి పెత్తీలేదు...... ఇంకేటి పేద్దుమని ఒకదండమెట్టీసి అంబారింకి ఒగ్గీపిన. అందలెన్నిపుట్లు తివి బలిపినానో సూడండి....." తాతయ్య ఆరిపోయిన గుండెల్ని బాదుకున్నాడు.

మళ్ళీ తిరిగి తనే అన్నాడు.

"నా బూమికి నాకొడుకే బాగారయిపోయినాడు గానీ ఆడిపెళ్లికి వాల్తులాలబంగారం పెట్టినప్పుడు. ...ముసిల్ది సచ్చిపోయిన ముందటేడు పేరు దిగిందంతే సేరాపరేసనుకి... కొడుకుని కళ్ళు బాగోలేవంటే తీసికెళ్ళిన పదేలుకి అప్పునాను తీర్చినాను. ఎవులు ఎవులుకు బాగో సెప్పండి? యవసాయం యాపారం అనుకుంతే ఏడాదయిన ఆదూ సూడ్డం లేదా?...." కళ్ళలో తిరుగుతున్న నీటిని తువ్వాలుతో అద్దుకున్నాడు.

కొద్దిసేపు గడిచాక--

"మరేనికి తగువులుగాని, ఆదిగాడు ఆడి రెండకరాలు ఆడు ఎలగా దున్నుకుంతండు, అప్పన్నా! నీ ఎకరామీద ఎంతపండితే అది తండ్రీ కొడుకులిద్దరీనా...." పెద్దమనిషి మాటకు చిన్న మామయ్య తాత్తు అంటూ ఎగిరిపడ్డాడు.

"నీను ఒక్కగింజొదల్ను.... పగం గిగం లేదు లేదు, ఆ ఎకరా నాదే. నా నోట్ల మట్టిగొట్టొద్దు... నీనూరుకోను, ఆదు

ఎంగా కోర్టు ఎక్కుతుందు, కోర్టులే కలుసుకుందుం....." కోపంతో మామయ్యకదలబోయాడు.

"అవ్వనా..... నీ మాట నీదీగాని, ముసిలోడు ఎన్నాలు బతకాలిరా?"

"ఆడు ఎప్పుడు సత్తాదు?" (ఆది) చిన్నమామయ్య కోపంగా అరిచాడు.

"ఇదరా వచ్చి సంపీరా..... సంపీ...." తాతయ్య అరుచుకుంటూ వెళ్ళి మామయ్య రెండు చేతులూ తీసుకొని తన మెడమీద వేసుకొని....."నీ చేతుల్తోటి నచ్చే పిసికీ...." అది దుఃఖమో, బాధో, ఏడుపో మరి....

నేను తాతయ్యను పక్కకు లాగాను.

పరంబావ మామయ్యను అక్కడి నుంచి తీసుకెళ్ళాడు.

అంబారం(కౌలు) తివ్వడుకి ధైర్యం వచ్చినట్టుగుంది. "ఆలు తండ్రీ కొడుకులు కోపంల వున్నారు, ఆలిద్దరూ ఒప్పొదావమై ఏటిసెయ్యమంతే అదే సేద్దుమ. ఇప్పుడంతే వుడుకు మీదున్నారు. సల్లబడి కబురు పెడితే వావే గింజలు పంపేత్తాను. ఇవులింట్లలేదు మంచిపొయ్యిగాని, ఈదిలపడి పోడమేనికి?" అంబారం పంట తనవద్దనేవుంటున్నదనడంలో ధైర్యంకంటే ధీమాయే నాకగుపించింది.

ఎవ్వరూ ముగింపు వాక్యం పలకక పోవడంతో తివ్వడిమాటే తిరుగులేనిదిగా వుంది. చిన్నమామయ్య, పరం బావ వెళ్ళిపోతున్నారు. జనం ఒక్కరొక్కరు కదుల్తూ సల్పబడుతున్నారు.

ఇందాక పెద్దగా వ్యవహరించిన ఒకాయన మా దగ్గరికి వచ్చి "...... ఒరే అప్పన్నా! తల మీదకొచ్చింది ఎండ, పకాలన్నంకూడ తినలేదుగల్ల.... ఎల్లి సల్లబడు...." అన్నాడే గాని ఊహించినట్టు తగువు గురించి మాట మాత్రానికయినా ఎత్తలేదు. ఏదో చెప్పాలని

చెప్పలేకపోతున్నట్టుగా వున్నాడు.

"పద తాతయ్యా" నేనూ బలవంతం చేసాను. నిస్సత్తువుగా తాతయ్య కదిలేడు. చోడవరం ఊర్లోకి వెళ్ళే ఒకేరోడ్డులో మావయ్య, పరం బావ ముందు నడుస్తుంటే..... తాతయ్య, నేనూ వెనక నడుస్తున్నాం. దార్లో మావయ్య, తాతయ్య మాట్లాడుకోలేదు. పరం బావ కూడా ఏమీ నాతోనయినా మాట్లాడలేదు. కళ్ళతో పలుకరించినా ఫలితంలేదు.

ఊరొచ్చింది. దార్లు వేరయ్యాయి. నేను తాతయ్యవెంట తవుడు మాఁవ ఇంటికి వెళ్ళాను. తవుడు మాఁవ ఇల్లరికం వున్న కొడుకుదగ్గరికి వెళ్తున్నాడట. ఇల్లు జాగర్తఅని చెప్పి వెళ్ళాడు. తాతయ్యే ఆ పూట వరిగట్టితో బియ్యం పొంగించాడు. చింతపండు పిడిచి చారుచేసాడు. అప్పడం కాల్చి ఇచ్చి, అన్నం వడ్డించాడు. తనో కంచంలో వేసుకున్నాడు.

తింటున్నప్పుడు 'అమ్మ నిన్ను తీసుకొని రమ్మంది' అన్నాను.

సమాధానం లేదు.

'ఎప్పుడు బయల్దేరుదాం?' మళ్ళీ అడిగాను.

తాతయ్య నోరు కదుక్కుంటూ "ఎల్దుంలే, రేపు పండగ్గావల్ల, మీ యమ్మసూస్తాది... నువ్వు పద, నేనొస్తాను" అన్నాడు. 'ఇద్దరం కలిసే వెళ్దాం' పట్టుదలగా అన్నాన్నేను. 'నేనేనికి నువ్వు ఎళ్లు' అన్నాడు మళ్ళీ.

'అమ్మ ఏడుస్తంది' అన్నాను నేను

అప్పుడు నా కళ్ళలోకి తాతయ్య క్షణంకాలం చూసేడు. ఆ చూపులో ఎన్నో ప్రశ్నలున్నాయి. మళ్ళీ తను ఇక్కడికి వచ్చి చేయవలసిన పోరాటాలూ వున్నాయి. ఏదో తేల్చుకొని వెళ్ళాలనే పట్టుదలా వుంది. అందుకు సాక్ష్యంగా ఆ సాయంత్రం నన్ను నరసన్న పేట

ప్రయాణం కమ్మన్నాడు. నేను కాదనలేదు.

వెళ్ళేసరికి చీకటి పడుతోంది. బస్టాండులో దిగి, రిక్షా ఎక్కితే తెలిసింది లాయరు ఇంటికని, ఇంటికి వెళ్ళేసరికి లాయరుగారు లేరు. పండగకి అత్తవారింటికి పెళ్ళాం బిడ్డల్ని దిగబెట్టడానికి వెళ్ళాడని, తను మాత్రం వున్నాడని.... రేపు వెళ్తాడని తెలిసి ఇంటిదగ్గరే ఇద్దరం ద్వారానికి రెండువైపులా గొర్కాల్లా నిల్చున్నాం. ఎప్పుడు నిద్రపట్టేసిందోగాని లాయరుగారు లేపిందాక తాతయ్యకూ, నాకూ వంటిమీద తెలివిలేదు. తెలివొచ్చిన వెంటనే, గుప్పున కంపొచ్చింది. ఆ తర్వాత ఆయన నోటినుంచి మాటొచ్చింది. వాళ్ళావిడ వెళ్ళిపోవడంతో లాయర్‌గారికి మూడొచ్చింది. బార్లో కెలితే ఇంతవేళకు తెలివొచ్చింది. ఆయన కథ విన్నాకే తాతయ్యకు తన కథ గుర్తొచ్చింది. లాయరుగారికి కేసూ గుర్తొచ్చింది.

తాతయ్య ఇచ్చిన మూడొందలు లెక్కపెట్టి తీసుకొని లాయరుగారడిగేరు.

"మరి శిస్తు ఎవులు చెల్లిస్తున్నారు?"

"రెండేళయిన సిన్నకొదుకుగాని, అంతను మునుపల్లా నానే" తాతయ్య చెప్పాడు.

'ఇరుకున పడ్డాం' అన్నాడు లాయరు. 'ఎవరు పేరున కడతన్నారో తెలుసునా?' లాయరు ప్రశ్నకి తాతయ్య తల అడ్డంగా ఊపేడు. శిస్తు ఎవరిపేరున కడుతున్నారో, ఎవరు కడుతున్నారో ఆలకే భూమి చెందుతుందట. పట్టా కాగితాలు, రసీదులు తీసుకురావాలిట. తప్పక న్యాయం జరుగుతుందట. పండగ మూడురోజులూ పోవాలిట, తర్వాత ఇంజక్షన్ ఇస్తాడట.

తాతయ్య అసంతృప్తిగానే సంతృప్తి పడ్డాడు. లాయరుగారు లోపలికి

వెళ్ళి తలుపు వేసుకున్నారు. ఆ అరుగుమీద నిద్రపట్టని నిట్టూర్పుల మధ్య ఆలస్యంగా తెల్లవారింది. మళ్ళీ వెనుదిరిగి తాతయ్యా, నేనూ ఊరు చేరుకున్నాం. ఆ పూటంతా తాతయ్య ఏదో ఆలోచిస్తున్నట్టే తలకు చేతులు ఆన్చి కూర్చున్నాడు.

నేను మాత్రం అక్కడ వుండలేక జానకత్త వాళ్ళ ఇంటివేపు నడిచాను. జానకత్త, వాళ్ళమ్మ ఊరప్పారేదు. లచ్చిమివుంది. పండుగ రోజుకదా, దొరోరి ఇంటికాడ పప్పారుబ్బడానికి తల్లీ కూతుర్లు వెళ్ళినట్టు చెప్పింది. జున్ను అమ్మ దాచిందని, వుండమని వచ్చేస్తారనీ చెప్పింది. మళ్ళీ వస్తానని చెప్పి అక్కడనుండి చిన్న మావయ్యగారింటికి వెళ్ళాను. గుండెలో ఏదో అలజడి నాకు తెలియకుండానే ప్రారంభమయింది.

మావయ్య, పరంబావ తీవ్ర ఘర్షణలో వున్నట్టున్నారు. నేను వెళ్ళడంతో అంతా సద్దుమణిగి పోయింది. కొంచెం సేపు నిశ్శబ్దం. ఎవ్వరూ ఏమీ మాట్లాడడం లేదు. కాసేపటికి అత్తయ్యే అంటోంది.... ఈ గుడిసేటు ఇంట్ల పండగలేదట, ఎప్పుడూ ఏట్లోల్లా ఈదిలబడి పోడమేనట, తమలాంటి కష్టాలు ఎవరికి రాకూడదట.... తనలో తనే మాట్లాడుతున్నట్టుగా వుంది. నేను అరుగు దిగుతున్నా ఎవ్వరూ ఏమీ అనలేదు. దార్లోనే తాతయ్య కలిస్తే కళ్లం వేపు వెళ్ళాం. తాతయ్య పొలంలోకి దిగాడు.

పొలాలన్నీ చేలుకోసేసాక వరిదుబ్బులు ఎండకు ఎండి మరింత గిడసబారి, అడుగేస్తే ముళ్లలా గుచ్చుకుంటున్నాయి. తాతయ్య అవేవీ పట్టించుకోవడంలేదు. చేతిలోకి పిడికెడు మట్టితీసి వాసన చూసాడు. చుట్టూ చూసాడు. నా వంక చూసాడు. పంకం వెల్లోట కోతలు కోస్తే మళ్ళీ అవేటిదాక దమ్ములు పట్టిందాక పొలాలన్నీ సౌశానాలయి పోతాయి. ఊరు కాలిచేసినట్టు గుంటాది. ఆరుమాసాలే అపుడు ఈ మట్టికి. నీలు సుక్కలుంటే డాలవాలు.... పెసరా... మినపా, లేపోతే లేదు. వున్నోలికి

వుంతే, లేనోడి కడుపులాగే అర్ధ ఆకాలిలాగే అర్ధకాలం పోలాలున్నా! ఆడయినా ఏటి బలికేస్తాదు? నాలాగే దొంద పడిపోతందు....' తాతయ్య గొంతును దుఃఖం ఆక్రమించుకుంది. వణుకుతున్న చేతుల్లోంచి మట్టి జారిమడిలో పడింది. కూలబడిపోతున్న తాతయ్యను నిల్చోబెట్టాను. కొంతసేపటికి స్థిమిత పడ్డాక 'పద' అన్నాడు ఇద్దరం కదిలేం. వీధిలోకి వచ్చేసరికి "మహాదేవా....మహాదేవా...." జంగపోడి గంట.... అదికూడా చిన్నమాఁవ ఇంటిముందరే!

"..... ఆ నల్లని పొగలోన ఆ నాగలోకమందు || మహాదేవా||
ఆ తెల్లని పొగలోన ఆ దేవలోకమందు || మహాదేవా||
నీ విలవిల పేనాలు - ఈఁడిపోయినాయ || మహాదేవా||
సూరమ్మా! నీవు - నీ కొడుకైనా
ఆది నారాయణ - గంగ ఒడ్డునేమో సాన్నాలు జేసి
గదిలో పిండంబు - గదియ బెట్టినాడు
మల్లెలు సంపంగి - మారెడు పత్తిరి...... || మహాదేవా||
కోటికి నీ ఇల్లు శివశంభో......."

గంటలు గణ గణ మని లయగా పడుతున్నాయి, అలవాటుగా అన్ని వివరాలతో పాడుతున్నారు. తాతయ్యతో పాటు నేనూ క్షణకాలం నిలబడిపోయాను. తాతయ్య ముఖంలో ఏదో సేద తీరిన భావం... . అది కూడా కొద్ది క్షణాలే!

బస్సు హారనుమోత లీలగా వినిపించింది. 'పద బస్సు వచ్చేస్తంది' తాతయ్యమాటతో నా మనసు తేలిక పడి జానకత్త ఇంటివేపు పరిగెత్తాను. 'తవుదు మాఁవగారి ఇంటి దగ్గరున్నానని జున్నుపట్టుకొని అమ్మెచ్చింది' లచ్చిమి మాట పూర్తికాక ముందే "నే ఊఁరుళ్తున్నా,

అమ్మకిచెప్పి పరుగుతీసాను లచ్చిమిఏదో చెప్తోంది. బస్సు వచ్చేసిందని ఎవరో కేకపెడుతున్నారు. తాతయ్య పిలుస్తున్నాడు. చిన్న మావ ఇంటికి చెప్పడానికి వెళ్ళేసరికి జంగాంనోట పాట, చేత గంటా రెండూ ఆగిపోయున్నాయి. పరం బావ సూట్‌కేసు పట్టుకు వెళ్తున్నాడు. ఆపడానికి వాళ్ళమ్మ చాలా అవస్థ పడుతోంది. మామయ్య పొమ్మనేసి తిడుతున్నాడు. పరం బావ పెళ్ళాం ఏడుస్తోంది. ఇంకేమీ చెప్పలేక వెనుదిరిగాను. పరుగులాంటి నడకతో దారిలోనే తాతయ్యను కలసి బస్టాండు చేరేసరికే బస్సు వచ్చి ఆగివుంది. మేం ఎక్కేసరికే పరంబావ బస్సులో కూర్చున్నాడు. మా వైపు చూసి తల తిప్పుకున్నాడు.

బస్సు కదిలింది. తాతయ్య కళ్ళలో నీళ్లూరుతుంటె కనిపించ నివ్వకుండా కిటికే వేపు తిరిగి ఆవలివేపుకు చూస్తున్నాడు. నేనీమీ కదపలేదు. పరం బావ ఆస్తిలో భాగం కావాలనే గొడవ పడినట్టు న్నాడు. 'నా బతుకు నన్ను బతకనివ్వరు' అని ఎవరితోనో అంటున్నాడు. బస్సు వేగం పెరిగింది. ఎవరో పిలిచినట్లయింది. జానకత్త జున్ను పట్టుకు వచ్చిందేమోనని బస్సులోంచి చూసాను, బస్సు రేపిన ధూళి, ముసురుకుంటున్న చీకటికి..... ఎవ్వరూ కనిపించలేదు.

ఆకాశం గుడగుడమంటోంది. చినుకులే రల్తాయో.... ఉరుములే మిగుల్తాయో? తుఫానే పెడుతుందో? చూడాలి!

*****